

# హేతువాద మానినీ జనమణీ మహాసభ

## పాలంకి సత్య

సాక్షికి జంఘాలుడు నమస్కారములు.

ప్రస్తుత కాలములో అందరూ గ్రాంథికాంధ్రములో కాక వ్యావహారిక తెలుగులోనే రచనలు చేస్తూండడం వల్ల నా లేఖను వ్యవహారభాషలో పంపిస్తున్నాను.

నాలుగు రోజుల క్రింద రాష్ట్ర రాజధానీ నగరంలో హేతువాద సభ ప్రత్యేకంగా స్త్రీలకోసం ఏర్పాటు చేశారు. హేతువాదమంటే ఏమిటి, ప్రపంచంలో నిర్హేతుకంగా ఏమైనా ఉంటుందా అన్న విషయం తెలుసుకునేందుకు సభకు వెళ్లేను. సభా ప్రాంగణం ఎక్కువగా స్త్రీలతో నిండిపోయింది. పట్టు చీరలూ, సింథటిక్ చీరలూ, నూలు చీరలూ, సల్వార్ కమీజులూ, పాంటు షర్టులూ, ఇంకా ఎన్నో కొత్తరకాల డ్రెస్సులతో ఉన్న మహిళలతో రంగురంగుల పూలతో ఉన్న వనంలా సభా ప్రాంగణం మెరిసిపోయింది. సభానిర్వాహకులు మాత్రం పురుషులే. స్త్రీలు తమకు వ్యతిరేకంగా ఏం మాట్లాడతారోనన్న కుతూహలంతో కాబోలు పురుషులు కూడా చాలామందే సభకు వచ్చారు.

సాక్షీ ఇతర మత ధర్మాలతో నాకు పూర్తి పరిచయం లేకపోవడం వల్ల నేను అందరు మహిళలు మాట్లాడిన విషయాలూ మన సభ్యులకోసం వ్రాయలేకపోతున్నాను. అందరికన్నా చివరగా హిందూ మతంలో స్త్రీలకు జరిగిన అన్యాయాల గురించి ఒక మానిని ఉపన్యసించారు. ఆ ఉపన్యాస సారాంశం ఈ లేఖ ద్వారా తెలియ చేస్తున్నాను.

''సోదరీమణులారా, ఇంతవరకూ మాట్లాడిన మహిళలు తమతమ మతాలలో స్త్రీలకు జరిగిన అన్యాయాల గురించి ప్రసంగించారు. కానీ హిందూమతంలో స్త్రీలకు జరిగిన అన్యాయం ఏ మతంలోనూ జరగలేదని ఘంటాపథంగా చెప్పగలను. అన్నిటికన్నా పెద్ద అన్యాయం ముందుగా వినండి'':

''నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి'' అన్నారు. ఏస్త్రీకీ స్వాతంత్ర్యానికి అర్హత లేదట. అంటే అర్థమేమిటి? స్త్రీ కట్టుబానిసలా పడి ఉండాలనే కదా. స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు పురుషుడి హక్కు. స్త్రీ స్వేచ్ఛగా ఉండకూడదు. పురుషుడి ఆజ్ఞానుసారం నడుచుకోవాలి. అంతే కదా.

అక్కడతో ఆగారా? ఉద్యోగం పురుష లక్షణమన్నారు. దాని అర్థమేమిటి? మగవాళ్ళు మాత్రమే ఉద్యోగాలు చెయ్యాలి. ఆడది ఇంటిపనీ, వంటపనీ చేస్తూ వంటింటి కుందేల్లా పడి ఉండాలి. ఆమె ఉద్యోగం చేసి డబ్బు సంపాదించకూడదు. ఆమె డబ్బుకోసం మగవాణ్ణి దేవిరించాలి. అతను కరుణించి నాలుగు రాళ్లు విదిలిస్తే సంతోషించాలి. అంతేకదా ఆమెకు ఆర్థిక స్వాతంత్ర్యం అవసరం లేదని ఎప్పుడో ఈ మగవాళ్ళు నిర్ణయించేశారు. ఒకవేళ ఆమె కాదు కూడదని డబ్బు సంపాదిస్తే ఏమవుతుంది. స్త్రీ విత్త అథమాథమం అంటూ ఆమె సంపాదనని హీనంగా చిత్రీకరించారు.

పోనీ ఇంట్లో పడున్నా ఈ మగవాళ్ళు ఊరుకున్నారా? లేదే. అందరూ భగవంతుడని కొలుస్తున్న రాముడేం చేశాడు? భార్యను అనుమానించాడు. ఆమె శీలాన్ని శంకించాడు. నిర్దాక్షిణ్యంగా నిండుగర్భిణిని అడవిలో వదిలేశాడు.

ఇలా ఉంది హిందూమతం....

ఆమె ఈవిధంగా చాలాసేపు ప్రసంగించింది. కరతాళధ్వనులు మిన్ను ముట్టాయి. చివరగా అధ్యక్షుల వారు సభకు వచ్చిన వారిలో ఎవరైనా తమ

> **''సోదరీమణులారా, ఇంతవరకూ మాట్లాడిన మహిళలు తమతమ మతాలలో స్త్రీలకు జరిగిన అన్యాయాల గురించి ప్రసంగించారు. కానీ హిందూమతంలో స్త్రీలకు జరిగిన అన్యాయం ఏ మతంలోనూ జరగలేదని ఘంటాపథంగా చెప్పగలను. అన్నిటికన్నా పెద్ద అన్యాయం ముందుగా వినండి''.**


అభిప్రాయాల్ని చెప్పవచ్చును, కానీ అయిదు నిముషాలకాన్నా ప్రసంగించకూడదన్నారు. నేను వెళ్ళి మైకు అందుకున్నాను. మగవాడిని కాబట్టో, సనాతన సంప్రదాయాన్ని ఎక్కువగా విశ్వసించేవాడిలా కనబడ్డానో, మరి ఏకారణమో కానీ అధ్యక్షులు ''స్త్రీలను కించపరిచేలా మాట్లాడకూడదు'' అన్నారు. నేను అంగీకారసూచకంగా తల ఊపి ప్రసంగం ప్రారంభించాను. కంచుకంఠం ఇచ్చిన భగవంతుడికి కృతజ్ఞతలు చెప్పుకున్నాను. అందరూ నిశ్శబ్దంగా వినసాగారు.


''సోదరీమణులారా, పురుషులతో సమంగా, చాలాచోట్ల వారికన్నా మిన్నగా, చదువుకుని, స్త్రీలు ఉద్యోగాలు చేస్తూన్నందుకు నేను ఎంతగానో సంతోషిస్తున్నాను. నా సోదరీమణుల అభ్యున్నతికి ఎంతగానో గర్విస్తున్నాను.''

కానీ, మహిళామణులారా, మీకు ఉపయోగిం చేవీ, లాభసాటి అయినవీ అయిన విషయాలనే మీరు మీకు వ్యతిరేకంగా వాడుకుంటున్నందుకు నేను విచారిస్తున్నాను. సోదరీమణి ''నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి'' అని చెప్పి స్త్రీలకు స్వేచ్ఛలేదనీ, పురుషులకి కట్టుబానిసల్లా పడి ఉండాలనీ హిందూ మతం నిర్దేశించిందని చెప్పినది. తల్లీ స్వేచ్ఛ వేరు, స్వాతంత్ర్యంవేరు. స్వేచ్ఛ అంటే తన ఇష్టమని అర్థం. ఎవరి ఇష్టమొచ్చినట్లు వాళ్ళు ఉండడాన్ని ఏ సమాజమూ అంగీకరించదు. స్వాతంత్ర్యమంటే తనను తాను పాలిచుకోడమని అర్థం. ఇక్కడ పాలన అంటే అధికారం చెలాయించడం కాదు. అలాగే అర్హత అన్నమాటకి హక్కు అన్న అర్థం లేదు. శక్తత అన్న అర్థం మాత్రమే ఉంది. బాల్యంలో తండ్రికీ, యవ్వనంలో భర్తకూ, వార్ధక్యంలో పుత్రుడికీ ఉన్న బాధ్యతల ప్రసక్తి మాత్రమే ఉంది తప్ప హక్కుల ప్రశ్న ఉత్పన్నం కాదు.

సోదరీమణులారా, మీరు మగవారితో సమంగా ఉద్యోగాలు చేస్తున్నారు. పూర్వం కొన్ని రంగాలలోనే స్త్రీలకు రాత్రి డ్యూటీలుండేవి. ఇప్పుడు మీరు న్యాయపరంగా, చట్టపరంగా పోట్లాడి అన్ని రంగాలలోనూ రాత్రి డ్యూటీ చేసే హక్కును సాధించుకున్నారు. మల్టీనేషనల్ కంపెనీలూ, బిపిఓలూ, సాఫ్ట్‌వేర్ రంగాల ధర్మమాని నైట్ డ్యూటీ చేసే స్త్రీల సంఖ్య ఎక్కువైంది. వారిపై అత్యాచారాలూ దురదృష్టవశాత్తూ ఎక్కువవుతున్నాయి. ఈ విపత్కర పరిస్థితిలో మీరు ''నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి'' అన్నది మీకు ప్రయోజనకారిగా ఉపయోగించుకోండి. మీకు జీతమిచ్చే యజమానికి మీ తండ్రికున్న బాధ్యతలే ఉంటాయి. రాత్రిపూట మిమ్మల్ని ఇంటికి పంపేటప్పుడు సరైన రక్షణ కావాలని హక్కుగా పోరాడండి. ఈ హక్కు ప్రాచీనకాలంనుంచీ ఉందనడానికి ''నస్త్రీ స్వాతంత్ర్యం మర్హతి'' అన్న శాస్త్రోక్తిని వాడుకోండి. అంతేకానీ మాకు స్వేచ్ఛకు హక్కు లేదన్న అర్థాన్ని మీరే చెప్తే మగవారు ఆ వాక్యాన్ని తమ ప్రయోజనాలకు వాడుకోరా?

అదేవిధంగా ''ఉద్యోగం పురుష లక్షణం'' అన్న






చోట ఉద్యోగమన్న మాటకి ప్రస్తుతమున్న అర్థం లేదు. ఒక్కసారి నిఘంటువు తెరిచి చూడండి, ఉద్యోగమంటే ప్రయత్నమని అర్థం. ప్రయత్నించడం మానవలక్షణమని అర్థం. ప్రయత్నించకుండా ఏదీ సాధించలేము. ఇప్పటికీ భారతంలోని ఉద్యోగ విజయాలు నాటకాలుగా ప్రదర్శిస్తూ ఉన్నారు కదా. సంధి కోసం చేసిన ప్రయత్నమే ఉద్యోగపర్వం.

ఇక శ్రీరామచంద్రుడు సీతను అనుమానించాడని రామాయణంలో ఎక్కడుంది తల్లీ. ''అంతరాత్మాచమేవేత్తి సీతా. శుద్ధాంయశస్వినీం'' అన్నాడాయన. సీత పవిత్ర అని నా అంతరాత్మకు తెలుసని ఆ వాక్యానికి అర్థం. రాజ ధర్మం కోసం స్వసుఖాన్ని త్యాగం చేశాడు. భార్యకోసం రవి అస్తమించని బ్రిటిషు సామ్రాజ్యాన్ని త్యాగం చేసిన ఎనిమిదవ ఎడ్వర్డుని పాశ్చాత్య దేశాలలోని ఆధునిక స్త్రీలు కూడా గౌరవించడం లేదే.

తల్లులారా, అధ్యక్షులు నన్ను అయిదు నిమిషాలలో ముగించమన్నారు కాబట్టి సోదరీమణి చెప్పిన ఇంకొక్క విషయమే ప్రస్తావిస్తాను. స్త్రీవిత్తం అధమాధమం అంటే స్త్రీ సంపాదన అధమమని అర్థంలేదు. తన సంపాదనవాడుకోడం ఉత్తమం, పిత్రార్జితం వాడుకోడం మధ్యమం, అన్నతమ్ముల ఆస్తికోసం ఆశించడం అధమం, ఇక స్త్రీ ధనానికై ఎగబడ్డం అధమాధమం అని ఆ శ్లోకానికి అర్థం.

స్త్రీ యొక్క ధనం మీద సర్వహక్కులూ ఆమెవే. ఈనాడు అమ్మాయిలని ఆమె తెచ్చే కట్నం కోసమో, ఆమె సంపాదన కోసమో ఆశపడి వివాహం చేసుకునే దురాశాపరులైన మగవారికి హెచ్చరికలా ఈ విషయాన్ని వాడుకోండి.

సోదరీమణులారా, సూపర్‌మార్కెట్లూ, హైపర్ మార్కెట్లూ, మాల్సూ రాజ్యం చేస్తున్న ఈ కాలంలో మీలో చాలా మందికి చేటలూ, జల్లెడలూ తెలియకపోవచ్చును. ఆహార పదార్థాలలో మంచినీ, వ్యర్థాలనూ వేరు చెయ్యడానికి చేటలనూ, జల్లెడలనూ ఉపయోగిస్తారు. చేట చెడును కిందకి వదిలేసి, మంచిని తనలో మిగుల్చుకుంటుంది. జల్లెడ మంచిని కిందకు వదిలేసి

**భార్యకు ద్రోహం చేసినవాడు గాడిద చర్మాన్ని వెంట్రుకలు బయటకు కనబడేలా కప్పుకుని ఆరునెలలు భిక్షాటన చేస్తూ జీవించాలి.**

చెడును తనలో మిగుల్చుకుంటుంది. మీరు జల్లెడలా మన ప్రాచీన సూక్తులలోని మంచిని వదిలి చెడును భూతద్దాలలో చూపే ప్రయత్నం చెయ్యవద్దని నా మనవి.

ప్రాచీన శాస్త్ర గ్రంథాలను ఆ మూలాగ్రం అర్థం చేసుకుని అందులో మీకు ప్రయోజనకరమైన విషయాలను గ్రహించండి. స్త్రీ పురుషుల శరీరాలు వేరు వేరుగా ఉన్నా స్త్రీ భోగసాధనమూ, పురుషుడు కర్తా కాదనీ, ఆమెకు కూడా సుఖపడేహక్కు ఉందనీ వాత్స్యాయన మహర్షి ఏనాడో తెలియచేశారు. మీ లైంగిక స్వాతంత్ర్య పరిరక్షణ విషయంలో ఆ విషయాన్ని పురుషులకి తెలియచెప్పండి. ఆదాయ వ్యయాల నిర్వహణ మాదేనని నిలదీసి చెప్పండి. మీకు ఉపయోగించే ఎన్నో విషయాలుండగా, వాటికీ వక్రభాష్యాలు చెప్పి మీకు మీరే నష్టం తెచ్చుకోకండి.

అధ్యక్షులు ఇక చాలించమని సైగ చేస్తున్నారు. కానీ మీరందరూ ఎంతో శ్రద్ధతో వింటున్నందువల్ల ఒక చిన్న శ్లోకమూ అర్థమూ చెప్పి ముగిస్తాను.

బహిర్లోమ్నాతు షణ్మాసాన్
వేష్టిత: ఖర చర్మణా
దారాభిక్రమణే భిక్షాం
దేహీత్యుక్త్వా విశుధ్యతి

భార్యకు ద్రోహం చేసినవాడు గాడిద చర్మాన్ని వెంట్రుకలు బయటకు కనబడేలా కప్పుకుని ఆరు నెలలు భిక్షాటన చేస్తూ జీవించాలి.

భార్య జీవించి ఉండగా ఇంకో స్త్రీతో సంబంధం పెట్టుకున్నా, భార్యాబిడ్డలను పోషించకున్నా, మద్యానికీ, జూదాలకీ, ఇతరవ్యసనాలకీ లోబడి భార్యకు తన జీతం ఇవ్వకపోయినా, ఆమెను దూషించినా, కొట్టినా, ఆమెకు ఏ ద్రోహం చేసినా మగవాడికి పై శిక్ష వెయ్యడానికి మహిళాలోకం ఉద్యమించాలి. పై శ్లోకమూ హిందూమతధర్మంలోనిదే.

సోదరీమణులారా, పాలనీ, నీళ్లనీ వేరు చేసి పాలను మాత్రమే స్వీకరించే రాజహంసలా మీరు ఆనందోత్సాహాలతో, విజయపరంపరతో కలకాలం వర్ధిల్లాలని కోరుకుంటూ శలవు తీసుకుంటున్నాను.

ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః

★